బుధవారం 08-01-2025

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 548 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నగారా

- షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం
- వివరాలు వెల్లడించిన రాజీవ్‌కుమార్




2 లో

## నేపాల్-టిబెట్‌లను వణికించిన భూకంపం

- దేశాల సరిహద్దుల్లో రిక్టర్ స్కేలుపై 6.8గా నమోదు
- 126మందికి చేరిన మృతుల సంఖ్య
- మరో 188 మంది గాయపడినట్లు సమాచారం



2 లో

## సంక్రాంతి పండగకు ప్రత్యేక బస్సులు

- 16 నుంచి 20 వరకు 3,200 ప్రత్యేక బస్సులు
- ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ ఎండీ ప్రకటన



3 లో

## మా నివాసాలను బిజెపి గుంజుకుంటుంది

మూడు నెలల వ్యవధిలో ఇది రెండోసారి తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుంది ఢిల్లీ సీఎం ఆతిశీ విమర్శలు



3 లో

## కేసుల సత్వర విచారణకు కొత్త వ్యవస్థ..

భారత్ పోల్ పేరిట పోర్టల్ ప్రారంభం

ప్రారంభించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా




2 లో

## దుర్మార్గ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్

- పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు దాడి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హెచ్చరిక



2 లో

## హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

బుద్ధభవన్‌లోని హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు



3 లో

ముందడుగు
బుధవారం
08-01-2025
హైదరాబాద్

# నేపాల్-టిబెట్‌లను వణికించిన భూకంపం



ముందడుగు జాతీయం

నేపాల్-టిబెట్‌లను సరిహద్దులను భారీ భూకంపం వణికించింది. మంగళవారం ఉదయం ఇక్కడ రిక్టర్ స్కేలుపై 6.8 తీవ్రతతో సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ విపత్తు కారణంగా టిబెట్‌లో ఇప్పటివరకు కనీసం 126మంది మృత్యువాత పడినట్లు చైనా అధికారిక మీడియా సంస్థ పేర్కొంది. మరో 188 మంది గాయపడినట్లు తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. నేపాల్-టిబెట్ సరిహద్దుకు 93 కిలోమీటర్ల దూరంలో ఉన్న లబుచె ప్రాంతంలో మంగళవారం ఉదయం 6.35 గంటలకు ఈ భూకంపం సంభవించింది. టిబెట్‌లోని షిజాంగ్‌లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు నేపాల్ అధికారులు తెలిపారు. కొన్ని క్షణాల పాటు తీవ్రస్థాయిలో ప్రకంపనలు రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ భూకంపం తర్వాత టిబెట్ రీజియన్‌లో మరో రెండుసార్లు ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వీటి తీవ్రత 4.7, 4.9గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. భూకంప కేంద్రం ఉన్న టిబెట్ ప్రాంతంలో పలు భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లుగా తెలుస్తోంది.

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నగారా

ముందడుగు ఢిల్లీ

ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. ఈ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. 70 శాసనసభ స్థానాలున్న ఢిల్లీకి ఒకే విడతలో ఫిబ్రవరి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ వెల్లడించారు.

ఢిల్లీ ఎన్నికల తేదీలివే..

నోటిఫికేషన్ విడుదల : జనవరి 10
నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ: జనవరి 17
నామినేషన్ల పరిశీలన : జనవరి 18
నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ : జనవరి 20
పోలింగ్ తేదీ : ఫిబ్రవరి 5
ఓట్ల లెక్కింపు : ఫిబ్రవరి 8

దిల్లీలో మొత్తం 1.55 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2.08 లక్షల మంది తొలి ఓటర్లు ఉన్నట్లు సీఈసీ తెలిపారు. 13,033 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అన్ని కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. 85 ఏళ్లు పైబడిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించనున్నట్లు తెలిపింది.

# దుర్మార్గ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్

ముందడుగు తెలంగాణ

దుర్మార్గ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన కాంగ్రెస్ పార్టీ తీరు మార్చుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తల దాడిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు.

పోలీసులను వెంట తీసుకొచ్చి బిజెపి కార్యాలయంపై రాళ్లు విసిరారని, పోలీసులు ఇలా వ్యవహరించడం ఎంత వరకు సమంజమని హైదరాబాద్ సీపీని ప్రశ్నించారు. బిజెపి తలచుకుంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రోడ్లమీద తిరగలేరని హెచ్చరించారు. రోజు రోజుకూ కనుమరుగవుతున్న కాంగ్రెస్ పార్టీ.. నిరాశతో భౌతిక దాడులకు దిగడాన్ని ప్రజలు క్షమించరన్నారు. ప్రజాస్వామ్యంలో హింసా రాజకీయాలు, భౌతిక దాడులకు తావు లేదన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఎక్కడ ఉందని భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. దాడిపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# కేసుల సత్వర విచారణకు కొత్త వ్యవస్థ..

ముందడుగు జాతీయం

దేశంలో కేసుల సత్వర విచారణ కోసం కేంద్ర ప్రభుత్వం సరికొత్త వ్యవస్థను ఆవిష్కరించింది. భారత్‌పోల్ పేరిట తీసుకొచ్చిన పోర్టల్‌ను మంగళవారం కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ప్రారంభించారు. అంతర్జాతీయ కేసుల విషయంలో కొత్త శకం ప్రారంభమైనట్లేనని ఈసందర్భంగా మంత్రి అభివర్ణించారు. దర్యాప్తు సంస్థలు సరికొత్త సాంకేతిక పద్ధతులను వినియోగించుకొని పరారీలో ఉన్న నేరగాళ్లను అదుపులోకి తీసుకునేందుకు ఇది ఉపకరించనుంది. ఏజెన్సీలు వేగవంతంగా అంతర్జాతీయ పోలీసుల సహకారం తీసుకునేందుకు సీబీఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) సహకారంతో దీనిని అభివృద్ధి చేశారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన దర్యాప్తు సంస్థలు ఇంటర్‌పోల్‌తో సులువుగా కనెక్ట్ అయ్యేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సవాళ్లను గమనించి, మన వ్యవస్థల్లో మార్పులు చేసుకోవా ల్సిన, ఆధునిక సాంకేతికతలను ఉపయోగించా ల్సిన సమయం ఇది. ఆ దిశగా భారత్‌పోల్ అనేది ఒక అడుగు" అని అమిత్ షా వెల్లడిం చారు. ఈ కొత్త వ్యవస్థతో పాటు, మూడు నేర చట్టాల గురించి రాష్ట్రాలకు శిక్షణ ఇచ్చే బాధ్యత ను సీబీఐ తీసుకోవాలని ఈసందర్భంగా కోరారు.

ముందడుగు
బుధవారం 08-01-2025
హైదరాబాద్

## మెట్రో రైలు విస్తరణపై

# రేవంత్ రెడ్డి సమీక్ష

- ఫ్లైఓవర్లను దృష్టిలో ఉంచుకొని మెట్రో ఎలైన్‌మెంట్
- శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభం

ముందడుగు హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, రేడియల్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. శంషాబాద్ విమానాశ్రయం - ఫ్యూచర్ సిటీ (40 కి.మీ.), జేబీఎస్ - శామీర్‌పేట్ (22 కి.మీ.), ప్యారడైజ్ - మేడ్చల్ (23 కి.మీ.) మెట్రో మార్గాలకు భూసేకరణ వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎలైన్‌మెంట్ రూపొందించే సమయంలో క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలన్నారు. ఆ మార్గాల్లో ఉన్న ఫ్లైఓవర్లను దృష్టిలో ఉంచుకొని మెట్రో ఎలైన్‌మెంట్ రూపొందించాలన్నారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభం కావాలని సీఎం సూచించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని రేవంత్ రెడ్డి సూచించారు.



సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మౌలిక వసతుల సలహాదారు శ్రీనివాస రాజు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండగకు ప్రత్యేక బస్సులు

ముందడుగు ఆంధ్రప్రదేశ్

సంక్రాంతి పండగ దృష్ట్యా అదనపు బస్సులు నడపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్ణయించింది. తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలకు బస్సులు నడపాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ ఎండీ ప్రకటించారు. జనవరి 8 నుంచి మొదలు 13 వరకూ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి పలుచోట్లకు 2,153 బస్సులు, బెంగళూరు నుంచి 375, విజయవాడ నుంచి 300 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు.తిరుగు ప్రయాణానికి ఈ నెల 16 నుంచి 20 వరకు 3,200 ప్రత్యేక బస్సులను నడపనున్నామని ఎండీ పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలుండవని, సాధారణ ఛార్జీలనే వసూలు చేస్తామన్నారు.

ఒకేసారి రెండు వైపులా టికెట్లు బుక్ చేసుకుంటే టికెట్ ధరపై 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆర్టీసీ ఎండీ తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలని.. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

## మా నివాసాలను

# బిజెపి గుంజుకుంటుంది

ముందడుగు ఢిల్లీ

కేంద్రప్రభుత్వం ముఖ్యమంత్రిగా తనకు కేటాయించిన నివాసాన్ని మరోసారి రద్దు చేసిందని ఢిల్లీ సీఎం ఆతిశీ విమర్శించారు. మూడు నెలల వ్యవధిలో ఇలా జరగడం ఇది రెండోసారని అన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. నివాసాన్ని రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి సోమవారం కూడా నోటీసులు వచ్చాయని అన్నారు. ఇంటిని ఖాళీ చేయాల్సిందిగా అందులో పేర్కొన్నారని వివరించారు.తన కుటుంబ సభ్యులను భాజపా లక్ష్యంగా చేసుకుంటోందని ఆతిశీ ఆరోపించారు. " నేను సీఎంగా ఎన్నికైన తర్వాత మా వస్తువులన్నింటినీ భాజపా కార్యకర్తలు రోడ్డు మీదకి విసిరేశారు. మా నివాసాలను భాజపా గుంజుకోవచ్చేమో కానీ, ఢిల్లీ ప్రజల అభివృద్ధి కోసం పని చేయకుండా మమ్మల్ని ఆపలేరు. అవసరమైతే.. ఢిల్లీ ప్రజల ఇళ్లలోనే ఉంటూ.. వాళ్ల కోసం పని చేస్తా" అని అన్నారు.

## సుప్రీంకోర్టును

# ఆశ్రయించిన కేటీఆర్

## న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు

ముందడుగు తెలంగాణ

తెలంగాణ ఫార్ములా ఈ-కారు రేసు వ్యవహారంలో మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను మంగళవారం తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ తరఫున న్యాయవాది మోహిత్‌రావు ఈమేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో పిటిషన్ వేశారు.

మరో వైపు తెలంగాణ హైకోర్టు కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేసిన వెంటనే తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది.



ఈమేరకు సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనను కూడా వినాలని ముందస్తుగానే పిటిషన్ వేసింది.

## కేటీఆర్ దాఖలు చేసిన

# క్వాష్ పిటిషన్ కొట్టివేత

## విరుద్ధంగా బదిలీ చేశారనే ఆరోపణలున్నాయి

## పలు కీలక వ్యాఖ్యలు చేసిన హైకోర్టు

ముందడుగు తెలంగాణ

తెలంగాణ ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది.

అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. హెచ్ఎండీఏ ఖాతాలోని డబ్బును నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారనే ఆరోపణలున్నాయి. రాష్ట్ర ఖజానాకు నష్టం చేకూర్చి ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలకు లబ్ధి చేకూర్చారని అభియోగాలున్నాయి. ఆరోపణల మేరకు ఏసీబీ అధికారులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పురపాలక మంత్రిగా ఉన్న కేటీఆర్ హెచ్ఎండీఏ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలున్నాయి. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసే అధికారాన్ని కోర్టు కొన్ని సందర్భాల్లో మాత్రమే ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. దర్యాప్తు విషయంలో హైకోర్టు జోక్యం




చేసుకోదల్చుకోలేదు" అని హైకోర్టు తీర్పు కాపీలో పేర్కొంది. కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

ముందడుగు
బుధవారం
08-01-2025
హైదరాబాద్

## మది పుస్తకంలో...

వినమ్రంగా విన్నవించుకున్నా
మదిలో భావాలన్నిటిని కలబోసి
బోసినవ్వు నుండి బామ్మ నా తలలో
పెట్టిన డిశంబ్రాల వరకు
వివరించా మది పుస్తకంలో....
విధేయతతో వ్రాసుకున్నా
ప్రేమ పంచిన వారి పేర్లన్నీ
నన్నసహ్యించుకొని
ఛీ కొట్టిన వారి జీవితాలన్నీ
సవివరంగా వ్రాస్తున్నా మది
పుస్తకంలో....
విపులంగా వివరిస్తున్నా
నా చుట్టూ పన్నుతున్న కుట్రలన్నీ
కుళ్ళుకు చస్తున్న మానవ సమూహాల
చిత్రాతి చిత్రమైన తీరుతెన్నుల్ని
మిత్రద్రోహుల పేరన్నిటిని వ్రాసుకున్నా
మది పుస్తకంలో...
విశాల హృదయంతో ఆలోచించడం
నేర్చుకున్నా ..
అందరినీ క్షమించేద్దామనుకుంటున్నా
ఎవరి కర్మకి వారే బాధ్యులనీ
నాపై పడి ఏడ్చే వాళ్లంతా అభాగ్యులనీ
ప్రార్థిస్తా నా దేవున్ని జీవగ్రంధమనే
పుస్తకంలో నన్ను, నాతో ఉన్న వారి
పేర్లు లిఖించమనీ..!!

వాసి జ్యోత్స్న
9866843005



## వెంకటాపూర్ పాఠశాలకు
# ఎడ్యుకేషన్ ఎక్సలెంట్ అవార్డు

### హైదరాబాద్ కార్యక్రమంలో అవార్డు అందజేత

ముందడుగు హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మల్టీజోన్ 2లో గల 19 జిల్లాల నుండి ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు తెలంగాణ రాష్ట్రస్థాయి ఎడ్యుకేషన్ ఎక్సలెంట్ అవార్డు- 2024 లభించింది. 2024వ సంవత్సరములో పాఠశాలల పనితీరు, పాఠశాలలో విద్యార్థుల సౌకర్యాలు, ఉత్తీర్ణత శాతం, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యార్థుల ప్రగతికి చేపడుతున్న చర్యలు, పాఠశాల వాతావరణము, పచ్చదనం పరిశుభ్రత తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయము, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, విద్యార్థులకు మినరల్ వాటర్ సౌకర్యము, నీటి వసతితో కూడిన బాల బాలికలకు వేరువేరు టాయిలెట్స్, ఇంటర్నెట్ కోసము వైఫై సౌకర్యం, పాఠశాలలో కిచెన్ గార్డెన్ విద్యతోపాటు సహ పాఠ్యాంశాలలో విద్యార్థిని, విద్యార్థులను తీర్చిదిద్దుతున్నందుకుగాను హై బిజ టీవీ వారు అతిథులచే




అందజేశారు. ఈ అవార్డును హెచ్ఎం రాధిక, జనగాం బాబురావు, సిహెచ్ అంబేద్కర్, మాజీ చైర్మన్ రమేష్ హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో అతిథులచే అందుకున్నారు. సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## పాకెట్ మనీతో
## అంధ విద్యార్థులకు సహాయం

### ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహణ




ముందడుగు కరీంనగర్

ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో అంధుల పాఠశాలలో పిల్లలకు ఫ్రూట్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. సుహాస్, నిశాన్, అశ్విత్, వేదశ్రీ, వరాజ్ పిల్లలు దాచుకున్న పాకెట్ మనీతో ఒక మంచి కార్యక్రమం చేయాలని మమ్మల్ని సంప్రదించగా వారి చేతుల మీదుగా అందులో పాఠశాలలో బిస్కెట్లు, ఫ్రూట్స్ పంపిణీ చేయడం జరిగిందని ఆదరణ సేవా సమితి ఫౌండర్ కర్రె పావని తెలిపారు. పిల్లల గొప్ప మనసును మెచ్చుకుంటూ వారి తల్లిదండ్రులకు అభినంద`నలు తెలియజేశారు.

### అవినీతిపరులను
## కఠినంగా శిక్షించాలి

### కంటెస్టెట్ ఎమ్మెల్యే కానుగంటి రాజు డిమాండ్

ముందడుగు హైదరాబాద్



అవినీతిపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుం టున్న చర్యలు మంచి పరిణామమని అని కాంగ్రెస్ సీనియర్ లీడర్, కంటెస్టెట్ ఎమ్మెల్యే కానుగంటి రాజు అన్నారు. హెచ్ఎండీఎలో జరుగుతున్న అవినీతిపై గత కొన్ని సంవత్సరాల నుంచి అవినీతిపై పోరాటం చేస్తున్న కానుగంటి రాజు గతంలో 500 కోట్ల స్కాం జరిగిందని 2020-21లో లోకాయుక్త, ఏసీబీ, విజిలెన్స్ డిపార్ట్ మెంటులో అరవింద్ కుమార్ టీంపై ఫిర్యాదు చేయడం జరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వెలుగులోకి తీసుకోవడం జరిగింది. గతంలోని అన్ని దర్యాప్తు సంస్థలకు కానుగంటి రాజు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అవినీతిని వెలికితీయడం అభినందనీయమన్నారు. అవినీతిపరులను ఏ కోణాన వదిలిపెట్టేదని కానుగంటి రాజు డిమాండ్ చేశారు.

# హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు

ముందడుగు హైదరాబాద్

హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలు, విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ(హైడ్రా) విషయంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బుద్ధభవన్‌లోని B-బ్లాక్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు.హైడ్రాకి విస్తృతాధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఏ చట్టం ప్రకారం ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్న ప్రశ్నలు తలెత్తడంతో.. జీహెచ్ఎంసీ చట్టం 1955ను సవరించింది. నగరంలోని జలాశయాలు, ఇతర ఆస్తులను కాపాడేందుకు అధికారిని లేదా సంస్థను ఏర్పాటు చేసే అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెడుతూ.. జీహెచ్ఎంసీ చట్టంలో కొత్తగా 374 బి సెక్షన్‌ను చేర్చింది.